క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: టీఎస్ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్ఆర్బీతో పాటు స్టేట్ సర్వీసెస్ కోసం జూన్ 1 నుంచి అక్టోబర్ 5వరకు వరంగల్, హైదారాబాద్‌లో ఉచిత కోచింగ్ శిక్షణ ఇవ్వడం జరుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష మే21న నిర్వస్తారని జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రంకృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండలంలోని గిద్దెముత్తారం గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అందుకుతండా గ్రామానికి చెందిన ఓనర్, డ్రైవర్ అన్నవేణి కిరన్, అన్నవేణి సమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది నవీన్, అస్లాంజానీ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



వెంకటాపురం(కె): పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలకు, చిన్నారులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్పవతి చంద్రకళ తదితరులు ఉన్నారు.

ఆలయం వద్ద నీటి ఎద్దడి

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల శివారు రామస్వామి గుట్ట వద్ద గల హనమాన్ ఆలయం వద్ద నీటి ఎద్దడి నెలకొంది. దీంతో హనుమాన్ మాలధారణ భక్తులు ఆలయం వద్ద పూజలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు గురువారం హనుమాన్ భక్తులు పని చేయని చేతిపంపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంచె రాజు మాట్లాడుతూ.. ఆలయం వద్ద నీరు లేక హనుమాన్ దీక్ష భక్తులు ఇబ్బదులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్‌కు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ఆలయం వద్ద నీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలని హనుమాన్ భక్తులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గ్రామ సమీపంలో ఎస్సై తిరుపతి రావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్ల మండలం, వాజేడు మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి రావు మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన పేపర్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ తనిఖీల్లో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ఏటూరునాగారం: వాజేడు మండలం శ్రీరామ్ నగర్‌కు చెందిన తాటి మహేందర్ ఇటీవల కూలర్లలో నీరు పోస్తూ విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ అసిసోయేషన్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గురువారం అందజేశారు. దాతలు ఇచ్చిన రూ.23వేల 500ల రూపాయల నగదును జవాన్ భార్య అశ్వినికి అందజేసి ధైర్యం చెప్పారు. ఖాజాపాషా, కయ్యూమ్, గయాస్, నారా ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల చేయూత

మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణకు ఇటీవల తునిక పండ్ల కోసం వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ నుంచి రూ.6వేల నగదును బాధితుడికి గురువారం అందజేశారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు అందజేసినట్లు పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పైడకుల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఉన్నారు.

‘సీసీ’ల నీడలో పల్లెలు

- గ్రామ గ్రామాన కెమెరాల ఏర్పాటు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న గ్రామస్తులు



టేకుమట్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



రేగొండలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

టేకుమట్ల: నేడు నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సహకరిస్తూ గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతుంది. నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని పోలీసులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నారు. గతంలో గ్రామాల్లో దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న సందర్భంలో ఎలాంటి ఆధారాలు లేక పోలీసులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురైన సందర్భాలు ఉన్నాయి. కానీ నేడు గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా ఉందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గడంతో పాటు ప్రజలకు భద్రత ఉంటుందని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కేసుల ఛేదింపు సులభం

కొన్ని గ్రామాల్లో జరిగిన సంఘటనలకు సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు కేసులను ఛేదించలేక ఇబ్బందులు పడేవారు. మరికొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉండడంతో సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకుని ఛేదిస్తున్నారు. దీంతో సీసీ కెమెరాల అవసరం రోజు రోజుకు పెరిగిపోతుండడంతో ఇప్పటి వరకు టేకుమట్ల, రేగొండ మండల కేంద్రాలతో పాటు ఆయా మండలాల్లోని పలు గ్రామాలలో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

సీసీ కెమెరాలతో ఛేదించిన కేసులు మచ్చుకు కొన్ని

- రేగొండ మండలంలోని మడ్తపల్లిలో బంగారం చోరీ కేసులో సీసీ కెమెరాల సహయంతో పోలీసలు నిందితులను పట్టుకున్నారు.
- రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో మెడికో విద్యార్థి అనుమానస్పద స్థితి మృతి కేసును సైతం సీసీ ఫుటేజీ ఆధారంగా ఛేదించారు.
- రూపిరెడ్డిపల్లిలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ట్రాక్టర్‌తో పరారైన వ్యక్తిని పోలీసులు గుర్తించారు.
- చిట్యాల మండల కేంద్రంలో నకిలీ మావోయిస్టుల పేరుతో వెలసిన వాల్ పోస్టర్‌లను సీసీ టీసీ ఆధారంగా ఛేదించి, నిందితులను పట్టుకున్నారు.
- టేకుమట్ల మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ వద్దకు మరమ్మతు కోసం తీసుకువచ్చిన మోటర్ చోరీలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు.
- టేకుమట్ల-రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని, వాహనాన్ని గుర్తించారు.
- మొగుళ్లపల్లి మండలంలోని బంగ్లాపల్లికి చెందిన రైతును మొట్లపల్లి పాల వ్యాన్ ఢీకొట్టి వెళ్లగా సీసీల ఆధారంగా కేవలం గంటలోనే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకున్నారు.

ధైర్యంగా ఉంటున్నాం..



గతంలో పల్లెల్లో దొంగతనాలు ఎక్కువగా ఉండేవి. ఏదైన దొంగతనం జరిగిందంటే ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాల ఏర్పాటుతో ఫుటేజీలను పరిశీలిస్తే ఎవరైనా దొరికిపోతారు. దీంతో దొంగతనాలు కూడా తగ్గిపోయాయి. బస్టాండ్ ఆవరణంలో మాకు పండ్ల దుకాణం ఉంది. సీసీ కెమెరాలు ఉండడం వల్ల పండ్లను రోడ్డుపైన్నే ఉంచుతున్నాం. సీసీ కెమెరాల వల్ల ధైర్యంగా ఉంటున్నాం.

\- సరిగొమ్ముల ప్రభాకర్ పండ్ల వ్యాపారి టేకుమట్ల

అవగాహన కల్పిస్తున్నాం..



రేగొండ మండలంలో ఇప్పటి వరకు 27 గ్రామాల్లో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, 15 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. భవిష్యత్‌లో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తాం. ప్రజలు కూడా సహకరిస్తున్నారు. త్వరలోనే మండలం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉండబోతుంది.

\- ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి ఎస్సై, రేగొండ

బాలల సంరక్షణకు చర్యలు



చిన్నారులతో మాట్లాడుతున్న శైలజ



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సాక్షి స్పందన

కాటారం: మండలంలోని మద్దులపల్లిలో తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మా రిన చిన్నారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమాధికారి శైలజ అన్నారు. మద్దులపల్లిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారి ము గ్గురు చిన్నారులకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ‘చిన్న వయస్సులో పెద్ద కష్టం’ అనే పేరిట ‘సాక్షి’లో గురువారం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికార యంత్రాంగం స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీడీపీఓ రాధికతో కలిసి జిల్లా సంక్షేమాధికారిణి శైలజ గ్రామానికి చేరుకొని చిన్నారుల పరిస్థితిపై గురువారం ఆరా తీశారు. అనాథ చిన్నారులకు బాలల సంక్షేమ సమితి, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో హనుమకొండలో వసతి ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల తండ్రి మృతితో వారికి అందాల్సిన రైతు బీమా అందేలా చూస్తామని తెలిపారు. ఆర్థిక సాయం అందిస్తున్న వారిని సమన్వయం చేసుకొని బాలలకు ఎలాంటి కష్టం కల్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ వెంకటస్వామి, ఇన్‌చార్జ్ సర్పంచ్ రమేశ్, అంగన్‌వాడీ టీచర్ డోలి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

చేయూత

అనాథ పిల్లలకు జయశంకర్ ఫౌండేషన్ సభ్యులు ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. గ్రామానికి వెళ్లి వారి దుర్భర స్థితిని ప్రత్యేక్షంగా చూశారు. చలించిపోయిన ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి, జిల్లా ఇన్‌చార్జ్ సాంబరాతి పోచన్న కలిసి రూ.5వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ముగ్గురు పిల్లలను చదివించి ఇంటికి మరమ్మతులు చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్, సభ్యులు రాకేశ్, నాగరాజు, సంపత్ తదితరులు ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్

పలిమెల: అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దని పలిమెల ఎస్సై-2 శివకుమార్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా గురువారం మండలంలోని బొడాయిగూడెంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై శివకుమార్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడే మావోమయిస్టులకు సహకరించడం లేదా ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. పనులకు వెళ్లే వారు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్య పెంచేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. కూలీ రేటు రోజుకు గరిష్టంగా రూ.272 ఉన్నందున కనీసం రోజుకి రూ.210 గిట్టుబాటు అయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలతో పని చేయించాలని తెలిపారు. రోజు వారి కూలీల సంఖ్య పెంచి ప్రతి కూలీకి లబ్ధి జరిగేలా చూడాలని వివరించారు. నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు



మాట్లాడుతున్న రమేశ్

కాటారం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు కలుగుతుందని ఉద్యానవన శాఖ అధికారి రమేశ్ అన్నారు. మండలంలోని చింతకాని రైతువేదికలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, విశిష్టత, యాజమాన్య పద్ధతులు, ఉద్యానవన శాఖ అందించే రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పంటలతో పోలుస్తే ఆయిల్‌పామ్ పంట రైతులకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గర్లో ఉన్న వ్యవసాయ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులను, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఓ రామకృష్ణ, ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్, ఏఈఓ దివ్య, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలో దళిత శక్తి ప్రోగ్రాం మండల అధ్యక్షుడు శీలపాక నాగరాజు ఆధ్వర్యంలో డీఎస్పీ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య ముగింపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కట్కూరి నరేందర్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, పద్మశాలి వివర్స్ వెల్ఫేర్ సొసైటీ చిట్యాల అధ్యక్షుడు ఈగ కోటి, డీఎస్పీ జిల్లా కోశాధికారి పుల్ల అశోక్, రమేష్, కృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న సునీల్

మహాముత్తారం: గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సునీల్ అన్నారు. గురువారం మండలంలోని యత్నారం గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీల్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేసుకోవడం వలన కలిగే నష్టాలపై వివరించారు. బాలల హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బడిమానేసిన బాలలు, అనాథ బాలలు, నిరాధారణకు గురైన బాలల సమాచారాన్ని చైల్డ్‌లైన్ 1098కి సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల రక్షణలో చైల్డ్‌లైన్ 24గంటలు పనిచేస్తుందన్నారు. బాల్యవివాహాల వలన శారీరకంగా, మానసికంగా ఎదురైయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ మండల ఇన్‌చార్జ్ ప్రవీన్‌కుమార్, సర్పంచ్ సుగుణ, చైల్డ్‌లైన్ మెంబర్స్ చరణ్, భాస్కర్, హేమంత్, అంగన్‌వాడీ కార్యకర్త, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘గ్రాడ్యుయేషన్ డే’



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

మల్హర్: మండలంలోని రుద్రారం, మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలల్లో అంగన్‌వాడీ టీచర్లు గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాలల్లోని 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు విభిన్నమైన వేషధారణ, ఆటల, పాటలతో ప్రదర్శనలు చేయించారు. చిన్నారాలకు ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా ఆట, పాటలు, క్రమశిక్షణతో కూడిన విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సాధ్యమవుతుందని టీచర్లు తెలిపారు. అనంతరం ప్రీస్కూల్ విద్యార్థులకు అభివృద్ధి నివేదికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుమలత, మమత, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలో ప్రయాణీకులకు నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, అందుకు బస్ షెల్టర్, మూత్ర శాలల నిర్మాణానికి కృషి చేయాలని మండల కేంద్రానికి గురువారం వచ్చిన జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రాను బీజేపీ నాయకులు కోరారు. అందుకు స్పందించిన ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు కేటాయించి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, ఎంపీపీ పున్నం లక్ష్మీరవి, రాజు, అనిల్, మల్లేష్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

ఫేర్‌వెల్ డే వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి కమ్యూనిటీహాల్‌లో కళాశాల ప్రినిపాల్ హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరస్పాడెంట్ గుర్రపు రవీందర్, సీఏఎంఈఎల్ డైరెక్టర్ మురళీధర్‌లు హాజరై మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతులు అధైర్యపడొద్దు

టేకుమట్ల(రేగొండ): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ హింగె మహేందర్‌జీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతన్నకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్ట అంచనా ప్రక్రియ పూర్తి అయ్యాక నివేదికను ప్రభుత్వానికి పంపిస్తారన్నారు. ప్రతిపక్షాలు కావాలనే రైతుల పాలిట మొసలి కన్నీరు కారుస్తున్నారని, అవగాహన లేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కు పాదం మోపనున్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించి అక్రమ నిర్మాణాల కట్టడికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాత్రిపూట మేస్త్రీలు, కూలీలు ఇంటి నిర్మాణాలకు పనిచేయకుండా ఉండటం, దుకాణాదారులు రాత్రి పూట ఇంటి నిర్మాణాలకు పరికరాలు సరఫరా చేయకుండా చర్యలు, కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి పీఓటీ యాక్టు ప్రకారం నోటీసులు తయారు చేయడంపై తీర్మానం చేశారు. అలాగే రాత్రిపూట పోలీస్‌పెట్రోలింగ్ ద్వారా ఇతర అధికారులతో కలిసి నిర్మాణాలను కట్టడి చేయూట, స్థానిక సర్పంచ్, కార్యదర్శి, ఎంపీటీసీలతో అక్రమ కట్టడాల నివారణకు సమావేశాలు నిర్మించుట అంశాలపై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ సుధీర్, తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి, ఎంపీడీఓ శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



డ్రోన్ కెమెరాతో తీసిన పల్లె ప్రకృతి వనం

మహదేవపూర్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ సూపర్వైజర్లు శ్రీకాంత్, మల్లేష్ అన్నారు. మండలంలోని బొమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ హరితహార కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతి వనాలను వారు గురువారం సందర్శించారు. ప్రకృతి వనంలో నాటిన మొక్కల పెరుగుదల, పచ్చదనాన్ని డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రకృతి వనంలో నాటిన ప్రతి మొక్క బ్రతికి ఉండేటట్లుగా చూడాలని అన్నారు. సిబ్బంది ప్రతివారం నీటిని పట్టించి 100 శాతం మొక్కలు బతికేలా చూడాలన్నారు. ఏపీఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, అజ్మత్ ఉన్నారు.

పంప్‌హౌస్‌లో పడి వ్యక్తి మృతి

భూపాలపల్లి రూరల్: స్నానానికి వెళ్లి పంప్‌హౌస్‌లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆజాంనగర్ గ్రామానికి చెందిన నగునూరి శ్రీకాంత్(34) అనే వ్యక్తి గొల్లబుద్దారంలో ఉంటూ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24న ఆజాంనగర్ నుంచి గొల్లబుద్దారం వెళ్లుతున్నాని కుటుంబ సభ్యులకు చెప్పాడు. మూడు రోజులైనా గొల్లబుద్దారం చేరలేదు. గురువారం ఉదయం పంప్‌హౌస్‌లో గుర్తు తెలియని శవం కనిపించగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాట్సాప్ గ్రూపులో విషయం తెలుసుకున్న శ్రీకాంత్ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు అవివాహితుడుకాగా సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.